## 6

# దేవుని కుటుంబం

“కాబట్టి మీరికమీదట పరజనులును పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు” (ఎఫెసీ. 2:19).

నీకొక ఖాళీ పేపరు చేతికిచ్చి, మానవ జాతికి దేవుడు ప్రసాదించిన బహు సంతృప్తి కరమైన పది ఆశీర్వాదములను పేర్కొనమంటే, నీవు వేటిని వ్రాస్తావు? మానవ జాతికి దేవుని బహు ధార్మికమైన అత్యంత సహాయాన్ని చేకూర్చే ఉపకారాలు అని నీవు ఏ పదింటిని తలస్తావు?

ఎక్కువమంది ప్రజలు జాబితా యొక్క పై భాగాన కుటుంబమని పేర్కొంటారని నేను నమ్ముతాను. ఏదెను తోటనుండి, యిటీవల జరిగిన వివాహపు వేడుకవరకు కుటుంబం ద్వారా లెక్కలేనన్ని సంతోషాలు, బలపరచే బాంధవ్యాలు అనుభవించబడ్డాయి. వారి సంతోషకరమైన జ్ఞాపకాలలో అనేకాలు వారు ఎదిగిన కుటుంబాల చుట్టు ఉన్నట్టు లేక ప్రస్తుతం వారు జీవించే కుటుంబాలలో ఉన్నట్టు అధిక సంఖ్యాకులు చెప్పవచ్చు. పైగా, తమ కుటుంబ సభ్యులనుండి దూరమై జీవిస్తున్నప్పుడు తమ అత్యధికమైన బలం, సహాయం పొందినట్టు చాల తక్కువమంది ప్రజలు చెప్పుతారని నా నమ్మకం. నిజంగా, మన ప్రాణాలకు ప్రోత్సాహము, కనికరము, ప్రేమ లభించే విధంగా పరలోకపు తండ్రి మానవ జాతికి కుటుంబ వ్యవస్తను ప్రసాదించాడు.

కుటుంబమనేది మనకు ఎలా అర్థవంతమైయుందో, క్రొత్త నిబంధన సంఘాన్ని ఆ రూపంగా చూడాలని లేఖనాలు సహాయం చేయడంలో ఆశ్చర్యపడనవసరం లేదు. “కుటుంబము,” “ఇంటివారు” అనే పద ప్రయోగాలు సంఘాన్ని కుటుంబంలా చూచునట్టు మనలను లేఖనాలు బలవంతపెడతాయి. మనం క్రైస్తవులమైనప్పుడు, సంఘమనే దేవుని ఆత్మసంబంధమైన కుటుంబంలోనికి మనం జన్మించాం (యోహాను 3:5; ఎఫెసీ. 2:19). మరో విధంగా చెప్పాలంటే, దేవుడు మనలను తన పిల్లలుగా స్వీకరిస్తాడు (ఎఫెసీ. 1:5). ఈ దత్తత స్వీకారం ప్రతిఫలమని, క్రీస్తు ప్రభువు ఈ లోకానికి అవతరించడంలో ప్రధాన కారణమిదియేనని పౌలు సూచించాడు: “అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను” (గలతీ. 4:4, 5).

## **అవసరతలు**

కుటుంబం మాత్రమే తీర్చగల కొన్ని ప్రామాణిక అవసరతలు మనుష్యులందరికి ఉంటాయి. ఈ అవసరతలు ఏమి? మొదటిగా, (కుటుంబానికి) చెందియున్నామనే **భావము** లేక "మూలము" మనలో ప్రతి ఒక్కరికి అవసరమై ఉంటుంది. సాంఘీక స్థిరత్వం భౌతిక కుటుంబం ప్రసాదిస్తుంది. ఈ లోకంలో మనకు, మనకు మాత్రమే చెందిన ఆశ్రయం అది అనుగ్రహిస్తుంది.

రెండవది, మనకు **భద్రతా భావన** అవసరం, మనం ఎప్పుడైనా మానసికంగా, సాంఘీకంగా, లేక శారీరకంగా నిస్సహాయులం అయితే, మనలను లక్ష్యపెట్టే సమాజంలో మనం భాగమయ్యున్నామనే అభయం అది కలిగిస్తుంది. భౌతికమైన కుటుంబం మనకు ఈ భద్రతనిస్తుంది. జీవితపు తుఫానులకు అది ఆశ్రయమిస్తుంది. మనం పసి పిల్లలమై ఉండి మనకు మనం సహాయం చేసుకోలేని సమయంలో అది మనలను పోషించి పెంచుతుంది. మనకు రోగం వచ్చినప్పుడు, లేదా ఆత్మలో నలిగిపోయినప్పుడు అది మన అవసరాలను తీర్చుతుంది, ముసలివారము బలహీనులమైనప్పుడు, మనం రెండవ పసితనాన్ని అనుభవించేటప్పుడు అది మనలను పోషించి సంరక్షిస్తుంది. అది మన ఆశ్రయం, మన దుర్గం, బలపరచే మన బండ అదే.

మూడవది, **గుర్తింపుతో కూడిన భావన** అవసరం. మనం ఎవరిమో ఏమైయున్నామో తెలిసికోవాలనే అంతరంగపు కోర్కె మనకుంటుంది. కొంతవరకు, మన భౌతిక కుటుంబాలు ఈ ఆశను కొంతమట్టుకు తీర్చుతాయి.

---

క్రొత్త నిబంధన సంఘంలో, క్రైస్తవుడు
ఆత్మసంబంధమైన (కుటుంబానికి) చెందినతనాన్ని అనుభవిస్తాడు.

---

నాల్గవది, **అంగీకరింపబడిన భావన** మనకు అవసరం, ముసుకులో, మేకప్పులో లేకుండ, మనం మనంగా ఎరుగబడే భద్రత కావాలి. మనమేమైయున్నామో దానికే భౌతిక కుటుంబం మనలను ప్రేమిస్తుంది – మనం ఏమి కాబోతున్నందుకో కాదు కాని మనం ఏమైయుంటున్నందుకే. మన భౌతికమైన కుటుంబాలలో, మనం అంగీకరింప బడడానికి ఏదో సాధించనవసరముండదు. మనం అతి శ్రేష్ఠులంగా ఉండకపోయినా, అతి శ్రేష్ఠమైనది జరిగించకపోయినా, మనం ప్రేమించబడతాం, కుటుంబంలో మన స్థానం మనకు ఉంటుంది. మనం పొందే ప్రేమను సంపాదించుకోవలసిన అవసరం ఉండదు; అవి బంధకాలు లేక కావలసినట్టి కోర్కెలు లేకుండగనే యివ్వబడుతోంది.

భౌతిక కుటుంబం సంతృప్తిపరచే ఉద్వేగ సంబంధమైన, సాంఘీక, భౌతిక అవసరాలవంటివి ఆత్మసంబంధమైనవి కూడా మనుష్యులకుంటాయి. ఆత్మసంబంధమైన ఈ అవసరములను కొంతమంది ప్రజలు తమయందు తామే గుర్తిస్తారు, యితరులు గుర్తించరు. వాటిని మనం గుర్తించినా గుర్తించకపోయినా, ఈ లోకంలో నిజమైన సంతోషంతో జీవించాలంటే, అవి నిజం, మనకొరకు అవి తీర్చబడవలసి యుంటుంది.

మన వ్యక్తిత్వానికినీ, ఆత్మకును ఆత్మసంబంధమైన పరిమాణముంటుంది. ఈ గుణగణాలు నిర్లక్ష్య పెట్టబడినా లేక అలక్ష్యం చేయబడినట్టయితే, ఒక రకమైన సామాజిక భౌతిక సంతోషాన్ని మనం అనుభవించినా, ఆత్మసంబంధమైన ఆనందాన్ని గాని, దేవుడు మనకొరకు ఉద్దేశించినదాన్ని గాని మనం నెరవేర్చలేం.

సాలెగూళ్లు తొలిగించడంవలన నా గదిని శుభ్రంగా ఉంచుకోవాలనుకున్నాననుకో? అలా తరచుగా నేను సాలెగూళ్లు తొలగించుతున్నట్టు నన్ను నేను కనుగొననా? సాలె పురుగు గూళ్లు కట్టుతూ ఉంటుంది, నా గదిలో సాలె పురుగు ఉన్నంతకాలం, అక్కడ అది గూళ్లు కడుతునే ఉంటుంది.

స్నానపు గది నిండా నీళ్లు పొర్లి పారుతున్నట్టు నేను కనుగొంటే ఎలా ఉంటుంది? నీళ్లను తుడుస్తునే ఉంటే నేను ఎంతగా విజయం సాధించగలుగుతాను? ఆ నీళ్లు ఏదో ఒక మూలనుండి వస్తూనే ఉంటాయి, నీళ్లు వచ్చే మూలమేదో కనుగొని దాన్ని అరికట్టేవరకు, స్నానపు గది నేలమీదనుండి నేను నీళ్లను తుడుస్తునే ఉంటాను.

మానవ జాతికంతటికి సాధారణమైన ఆత్మసంబంధమైన అవసరతలు ఊరకనే పోవు. అవి లేవన్నట్టు మనం నాటకమాడినంత మాత్రాన అవి సంతృప్తిపరచబడవు. సహజమగు భౌతిక సంతోషము, ఆత్మసంబంధమైన ఆనందం అనుభవించడానికి గాను, ఈ భౌతికమైన, ఆత్మసంబంధమైన అవసరతలు తీర్చబడవసియుంటుంది.

## అవసరతలు తీర్చబడ్డాయి

మనమందరం కలిగియున్న ఆత్మసంబంధమైన అవసరతలన్నీ దేవుని కుటుంబమనే మరొక కుటుంబ యూనిట్‌వలన తీర్చబడతాయి. ఆత్మసంబంధమైన ఆయన కుటుంబములో, దేవుడు తండ్రిగాను (1 యోహాను 3:1), క్రైస్తవులందరు అన్నదమ్ములు అక్కచెల్లెండ్రుగాను (1 యోహాను 5:1), ప్రభువైన యేసు జ్యేష్ఠుడుగాను (రోమా 8:17) ఉంటారు. పరలోకసంబంధమైన ఈ కుటుంబాన్ని పౌలు "సంఘ"మన్నాడు. పౌలు తిమోతితో యిలా అన్నాడు, "శీఘ్రముగా నీయొద్దకు వత్తునని నిరీక్షించుచున్నాను; అయినను నేను ఆలస్యముచేసినయెడల దేవుని మందిరములో, అనగా **జీవముగల దేవుని సంఘములో**, జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని ఈ సంగతులను నీకు వ్రాయుచున్నాను" (1 తిమోతి 3:14, 15; ఎంఫసిస్ నాది).

క్రొత్త నిబంధన సంఘములో, క్రైస్తవుడు **ఆత్మసంబంధమైన భావాన్ని** కలిగియుంటాడు. ప్రార్థన వినడానికి, కలిసి నడవడానికి వానికి పరలోకపు తండ్రి ఉన్నాడు. ఆయనకొరకు జీవించడానికిని, తన ద్వారా ప్రార్థించడానికిని తన వద్దనుండి నేర్చుకొనడానికిని, తనమీద ఆనుకొనడానికి, మనకు జ్యేష్ఠుడైన సహోదరుడున్నాడు. సహోదర సహోదరీలుగా ఒకరినొకరు ప్రేమించుకొంటూ, దేవుని మహిమకొరకు పనిచేసే ఒక సంస్థగా కాక, ఆత్మసంబంధమైన కుటుంబముగా ఉన్న విశ్వాసుల సమాజంలో ఆయన భాగమై యుంటాడు.

దేవుని కుటుంబంలో, **ఆత్మ సంబంధమైన భద్రత మనకుంది.** మన పరలోకపు తండ్రి

మనలను ప్రేమిస్తూ, మనకు కావలసినవాటిని దయచేస్తాడు. ఆయన మన భౌతికమైన అవసరతలకు సహా అనుగ్రహిస్తాడు. తన అనుచరులకు చింతింపవలదని బోధించి, మన తండ్రికి మన అవసరాలు తెలుసునని, ఆయన వాటిని గూర్చి లక్ష్యపెడతాడని ప్రభువు తెలియజేశాడు: "కాబట్టి – ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించు కొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును" (మత్తయి 6:31, 32). అలాగే, మన తండ్రి ఆత్మసంబంధమైన మన అవసరతలకు కావలసినవాటిని దయచేస్తాడు, "తొట్రిల్లకుండ మిమ్మును కాపాడుటకును, తన మహిమ యెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువబెట్టుటకును, శక్తిగల"వాడని దేవునికి స్తుతి చెల్లించుచూ యూదా మనకు జ్ఞాపకం చేశాడు (యూదా 24).

సంఘమను దేవుని కుటుంబంలో, **ఆత్మసంబంధమైన మన గుర్తింపు** యొక్క అవసరత తీర్చబడింది. మార్పుకు ముందు, గమ్యంగాని, దిక్కుగాని తోచక మనం తిరుగులాడాం; కాని దేవుని కుటుంబంలోనికి పుట్టడంతోనే, మనం దేవుని సొత్తుగా మారిపోయాం. ఈ మార్పును గూర్చి పేతురు యిలా వ్రాశాడు:

> అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు. ఒకప్పుడు ప్రజగా ఉండక యిప్పుడు దేవుని ప్రజయైతిరి, ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడినవారైతిరి (1 పేతురు 2:9, 10).

దేవుని కుటుంబాన్ని, పౌలు దేవుని స్వాస్థ్యంగా సూచించాడు (ఎఫెసీ. 1:18). దేవుని కుటుంబంయొక్క సభ్యులుగా, క్రైస్తవులకు నిత్య స్వాస్థ్యంగా పరలోకం ఉంది; దేవునికి కూడా స్వాస్థ్యముంది – వారు క్రైస్తవులు!

అలాగే దేవుని కుటుంబం **ఆత్మసంబంధమైన అంగీకారాన్ని ప్రసాదిస్తుంది**. విధేయతతో కూడిన విశ్వాసంతో మనం దేవునియొద్దకు వచ్చి ఆయన యెదుట యథార్థమైన విధేయతతోను, సంపూర్ణ నమ్మికతోను ఉన్నట్టయితే, మనం ఆయన పిల్లలంగా అంగీకరింపబడతాం. ఆయన తన ప్రత్యేకమైన ప్రేమను మనయందుంచి, తన కుమారుని ఆత్మను మనలో ఉంచి, "నాయనా! తండ్రీ!" అని మొర్రపెట్టే దయను మనకు ప్రసాదిస్తాడు (గలతీ. 4:6). పౌలుతో చేరి క్రీస్తునందు మనం యిలా చెప్పవచ్చు, "కాబట్టి యిప్పుడు క్రీస్తుయేసునందున్నవారికి ఏ శిక్షావిధియు లేదు" (రోమా 8:1). అంటే, మారుమనస్సు గాని, అభివృద్ధి గాని యిక అక్కరలేదని దీని భావం కాదు; మనం ఎక్కడ నిలిచామో అక్కడ ఆయన మనలను అంగీకరించి, మనం ఎక్కడ ఉండాలో అక్కడికి దయగా నడుపుతాడు, "మనం ఉన్నపాటున ఆయన మనలను ప్రేమిస్తాడు కాని మనం ఎక్కడున్నామో అక్కడ విడిచిపెట్టలేనంతగా ఆయన మనలను ప్రేమిస్తున్నాడని" ఒక వ్యక్తి అన్నాడు.

కొన్ని సంవత్సరాల క్రిందట, ఇంగ్లాండులోని లండన్‌లో వివాహితురాలైన ఒక

యువతిని క్రీస్తులోనికి నడిపించ ప్రయత్నం చేసిన విషయం నాకు జ్ఞాపకముంది. ఒక్క బిడ్డ కలిగిన ఆమె అందమైన తల్లి. వివాహమైన కొద్ది నెలలకే, తన భర్త ఆమెను వదలిపెట్టాడు, మరియు ఆమె ఆ బిడ్డను తానే పెంచుకొంటుంది. తాను చిన్న బిడ్డగా ఉన్నప్పుడు సయితం తన కుటుంబ జీవితం అంత బాగుగా లేనట్టుంది. మా సంభాషణలో, "క్రీస్తు ద్వారా నీవు రక్షింపబడగలవు మరియు రమ్యమైన గృహాన్నికూడా పొందగలవు" అని నేను ఆమెతో చెప్పాను! నా రిమార్కు ఆమెను ఏ మాత్రము ప్రోత్సాహించలేదు. ఎందుకో నేను ఆశ్చర్యపోయాను. అప్పుడు రమ్యమైన గృహాన్ని గూర్చిన ఐడియా ఆమెకు లేదని నేను గ్రహించాను. గృహం ఆకర్షణీయమైనదిగాను అద్భుతమైనదిగాను ఆమె ఎన్నడు చూడలేదు. ఆమె అనుభవంలో గృహమంటే ఏదైనా కావచ్చు కాని, అది ఆశ్రయ మిచ్చేదిగా, బలపరచేదిగా, ప్రేమతో కూడింది మాత్రం కాదు; గృహాన్ని రమ్యమైనదిగా చూడడం ఆమెకు కష్టంగా ఉంది. ఏదియెలాగున్నా, శరీరసంబంధమైన, ఉద్వేగ సంబంధమైన, ఆత్మసంబంధమైన అవసరతలను తీర్చేదిగా కుటుంబాన్ని చూడగల ఎవనికైనా అది ఎంతో రమ్యంగా ఉంటుందని తెలుసు.

ఈ యువతివలె, సంఘము ఆత్మసంబంధమైన మన అవసరతలను ఎలా తీర్చుతుందో అనేక మందికి తెలియదు. వారు క్రొత్త నిబంధన సంఘాన్ని చూచియుండరు. సంఘాన్ని దేవునియొక్క ఆత్మసంబంధమైన కుటుంబంగా వారు చూచియుండరు. అందువలన, క్రీస్తు ప్రభువు సంఘానికి వేరుగా ఉండడంవలన వారు ఏమి పోగొట్టుకొంటున్నారో వారెరుగరు. సంఘమంటే ఏమో, దేవుని కుటుంబంగా నిజమైన సంఘము మన జీవితాలలో ఆత్మసంబంధమైన పరిమాణాలకు ఏవిధంగా జవాబిస్తుందో జనులకు జ్ఞాపకం చేయడం క్రైస్తవుల బాధ్యతయై ఉంది.

మన అంతరంగ పురుషుడు వాంఛించే సమాధానం, భద్రత, ఉద్దేశం, గుర్తింపు అనేవి దేవుని కుటుంబం ద్వారానే మనం కనుగొనగలం. సంఘమనే ఈ కుటుంబానికి వెలుపల నిజమైన సంతోషం మనది కాదు.

## అవసరతలు రమ్యంగా తీర్చబడతాయి

సంఘాన్ని దేవుని కుటుంబంగా చూడడానికి గాను, యెరూషలేము సంఘమును గూర్చి లూకా యొక్క వర్ణనను చూద్దాం. ఆది క్రైస్తవుల అనుదిన జీవితాల్లో దేవుని కుటుంబంయొక్క రమ్యమైన స్వభావ లక్షణాలు అతని వివరణతో కూడిన వర్ణన చూపుతుంది:

> వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి.
>
> ... విశ్వసించినవారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వారు తమ చరస్థిరాస్తులను అమ్మి, అందరికి వారివారి అక్కరకొలది పంచిపెట్టిరి, మరియు వారేకమనస్కులై ప్రతిదినము దేవాలయములో తప్పక కూడుకొనుచు ఇంటింట రొట్టె విరుచుచు, దేవుని స్తుతించుచు, ప్రజలందరివలన దయపొందినవారై ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము

పుచ్చుకొనుచుండిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్నవారిని అనుదినము వారితో చేర్చుచుండెను (అపొ. 2:42-47).

"విశ్వసించినవారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమష్టిగా ఉంచుకొనిరి" (అపొ. 2:44). అంటే, ప్రతి క్రైస్తవుడును చెందినవాడనే భావన కలిగియున్నాడని అర్థం. ప్రతి సభ్యునికి గుర్తింపు ఉంది, ఎందకంటె ఒకనికంటె మరియొకనిని యోగ్యునిగా ఎంచలేదు. మరియు బాధపడే ఏ వ్యక్తియొక్క అవసరతతోనైనా సంఘమంతయు ఏకంగా స్పందించింది. ప్రతి ఒక్కడు అంగీకారాన్ని అనుభవించాడు. అనుదినము జనులు ప్రభువు శరీరంతో చేర్చబడుతునే ఉన్నారు. స్థానిక సంఘంచేత వారు స్వీకరింపబడుతునే ఉన్నారు. సామాజిక జీవిత విధానంలో ప్రసాదింపబడే భద్రత ప్రతి ఒక్క సభ్యుడు అనుభవించాడు. "వారు తమ చరస్థిరాస్తులను అమ్మి అందరికిని వారి వారి అక్కరకొలది పంచిపెట్టిరి"

దేవుని కుటుంబంగా ఈ స్థానిక సంఘం ప్రార్థన స్తుతి, ఉపదేశము, సహవాసము, ప్రభురాత్రి భోజనాన్ని ఆచరించడంలో క్రమంగా దేవుని ఆరాధనయందు నిమగ్నమైయుంది (అపొ. 2:42). వారు తమ పరలోకపు తండ్రిని ఘనపరిచారు, ప్రభువైన యేసుక్రీస్తును, వారి జ్యేష్ఠ సహోదరుని ద్వారా అనుగ్రహింపబడిన కృపావరాన్ని గుర్తించారు, వారు ఆనందముతోను నిష్కపటమైన హృదయంతోను జీవించారు. వారు సామాజిక జీవితం యొక్క భద్రతను, ఈ జీవితానికి సంబంధించి ఔదార్యపు సంరక్షణను రాబోవు లోకంలో, ప్రభువైన యేసు ద్వారా నిత్యజీవం యొక్క నిశ్చయతను అనుభవించారు.

కొన్ని సంవత్సరాల క్రితం నేనొక చిన్న స్థానిక సంఘానికి ప్రసంగిస్తుండగా, చర్చ్ బిల్డింగ్ ప్రక్కకు వచ్చిన ట్రెయిలర్ యింటిని చూచాను. అది అక్కడ నిలిపిన యింకో క్లాస్ రూమ్ అనుకున్నాను. "ఈ ట్రెయిలర్ హౌస్ దేనికి?" అని నేను ఒక సభ్యుని అడిగాను. "అది ఒక విధవరాలికి" అని నవ్వుతూ అతడు జవాబిచ్చాడు. "ఈ స్థానిక సంఘానికి సంబంధించిన ఒక క్రైస్తవుడు యిటీవల చనిపోయాడు, అతని భార్య ఒంటరిగా మిగిలిపోయింది. ఆమెకు జరుగుబాటు లేదు, తీసికోవలసిన నిర్ణయాలు తీసికొనడం ఆమెకు కష్టమైపోయింది, అందువలన ఈ ట్రెయిలర్ హౌసును చర్చ్ బిల్డింగ్ వెనుకకు జరిపాం. ఆమెకు అవసరమైన భద్రత, సహకారం లభించునట్టుగా మేము ఆమెను దానిలో ఉంచాం. ఏదో ఒక విధమైన సేవచేయకుండ ఊరకే ఉండడం ఆమెకు యిష్టం లేదు, గనుక ఈ బిల్డింగ్‌కు సంబంధించి వాకిట కాపలా కాసే పనిని ఆమెచే చేయనిస్తున్నాం" అని అతడింకను వివరించాడు. "దేవుని కుటుంబాన్ని సూచించవలసిన రమ్యమైన అక్కర కనుపరచడం యిది" అని నేను వింటూ ఆలోచించాను.

## ముగింపు

నీవు దేవుని కుటుంబములో సభ్యుడవై యుండగోరావా? సంఘమనే దేవుని కుటుంబంలో నీవు ప్రవేశించేవరకు నీ జీవితం సంపూర్ణమయింది కాదని నీవు గుర్తిస్తున్నావా? ఆయన కుటుంబానికి వెలుపల నీవు ప్రవేశించేవరకు నీ జీవితం సంపూర్ణమయింది కాదని నీవు గుర్తిస్తున్నావా? ఆయన కుటుంబానికి వెలుపల,

ఆత్మసంబంధమైన స్థిరత్వాన్ని, భద్రత, అంగీకారము, కేవలం దేవుని కుటుంబం అనుగ్రహించే గుర్తింపు అనేవాటిని నీవు పొందగలవు.

దిక్కులేనివాడు అనే ఆలోచనకు ప్రతి బిడ్డ భయపడతాడు, మరియు దిక్కులేని వానిని చూచే ప్రతి పెద్దవాని హృదయం పరితపిస్తుంది. ఎవడు దిక్కుమాలినవాడుగా ఉండగోరడు, దిక్కులేని వానిని చూడాలని ఎవడు కోరుకోడు. అయితే, మనం చేయగలిగిందంతా జీవితం యొక్క క్రూరమైన పరిస్థితులవలననో, మానవ అన్యాయం వలననో పిల్లలను దిక్కులేనివారినిగా చేయడాన్ని అరికట్టడానికి మనవలన కుదరని పని; ప్రేమతోను, కనికరంతోను సహాయంతోను దిక్కులేని పిల్లలను సంధించడమే. ఏదియెలాగున్నా, ఎవడును ఆత్మసంబంధమైన దిక్కులేనివాడుగా ఉండగోరడు. సువార్త ద్వారా, ఎవడైనా దేవుని కుటుంబంలోనికి ప్రవేశింపవచ్చు, ఆయన కుమారునిగా దత్త పుత్రాత్మను పొందవచ్చు, తక్కిన పిల్లలందరు పొందే కుమారత్వాన్ని తానును పొందవచ్చు.

ఆత్మసంబంధమైన జన్మ ద్వారా దేవుని కుటుంబంలో మనం ప్రవేశిస్తాం. “ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మింపకుంటే దేవుని రాజ్యములో ప్రవేశింపడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను” అని ప్రభువైన యేసు అన్నారు (యోహాను 3:5). క్రీస్తునందు విశ్వాసముంచడానికి దేవుని వాక్యముద్వారా (యోహాను 8:24), మారుమనస్సు పొంది (అపొ. 17:30), యేసును క్రీస్తుగాను ప్రభువుగాను ఒప్పుకొని (రోమా 10:10), క్రీస్తులోనికి బాప్తిస్మం పొందేలా ఆత్మచేత నడిపించబడ్డాం (1 కొరింథీ. 12:13). పేతురు యిలా అన్నాడు, “మీరు క్షయబీజమునుండి కాక, శాశ్వతమగు జీవముగల దేవుని వాక్య మూలముగా అక్షయబీజమునుండి పుట్టింపబడినవారు ...” (1 పేతురు 1:22).

నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించినవారిని దేవుడు తన కుమారులనుగా స్వీకరిస్తాడు. ఆయన తన ఆత్మను వారికిస్తాడు (గలతీ. 4:6), తన కుటుంబంయొక్క దీవెననిస్తాడు (ఎఫెసీ. 1:3), నిత్య స్వాస్థ్యమిస్తాడు (ఎఫెసీ. 1:11). తత్ ఫలితంగా, దేవుని పిల్లలు, చెందినతనాన్ని, భద్రతను, అంగీకారాన్ని, గుర్తింపును పొందుతారు.

నీవు దేవుని బిడ్డవా?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. కుటుంబం ద్వారా నీవు అనుభవించిన సంతోషాలను పట్టికవేయుము.
2. ఒకడు దేవుని కుటుంబంలో ఎలా ప్రవేశిస్తాడు?
3. దేవుడు మనలను తన పిల్లలుగా ఎప్పుడు స్వీకరిస్తాడు?
4. ప్రతి వ్యక్తియొక్క ప్రామాణిక అవసరతలను పేర్కొని, కుటుంబం వీటిని ఎలా తీర్చుతుందో వర్ణించు.
5. మానవ ప్రామాణిక అవసరతలతో మన ఆత్మసంబంధమైన అవసరతలను పోల్చుము.

6. క్రైస్తవుడు భాగమైయున్న ఆత్మసంబంధమగు కుటుంబాన్ని వర్ణించు.
7. దేవుని కుటుంబము మనకు ఆత్మసంబంధమైన భద్రతను ఎలా యిస్తుంది?
8. ఆత్మసంబంధంగా దానికే చెందామనే భావనను దేవుని కుటుంబం ఎలా యిస్తుంది?
9. ఆత్మసంబంధమైన గుర్తింపును దేవుని కుటుంబం ఎలా యిస్తుంది?
10. ఆత్మసంబంధమైన అంగీకారాన్ని దేవుని కుటుంబం మనకు ఎలా యిస్తుంది?
11. సంఘంలో ఉండడం ద్వారా ఆత్మసంబంధమైన మన అవసరతలు ఎలా తీర్చబడతాయో యెరూషలేము సంఘాన్ని ఉపయోగించి ఉదహరించు.
12. దేవుని ఆత్మసంబంధమైన కుటుంబంలో ప్రవేశించేవరకు ఒకడు సంపూర్ణుడు కాగలడా?
13. దేవుని కుటుంబానికి వెలుపల ఉన్నవాడు ఒక విధంగా అనాధగా ఉన్నాడా?
14. దేవుని ఆత్మసంబంధమైన కుటుంబంలో అనుభవించే ఆశీర్వాదములను పేర్కొనుము.